# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ యోగాను జీవితంలో భాగం చేసుకుంటూ.. ఆరోగ్య జీవనం సాగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారు.
- ❖ పొగాకు కొనుగోళ్లకు కేంద్ర నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ని కోరారు.
- ❖ విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగ దినోత్సవానికి విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వెల్లడించారు.
- ❖ NEET UG- 2025లో ఉత్తీర్ణులైన వైద్య విద్యార్థులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు.

======================

ప్రపంచానికి భారతదేశం ప్రసాదించిన దివ్య వరం... యోగ అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం “ఎక్స్” వేదికగా తెలిపారు. ఆరోగ్యాన్నే కాకుండా ఆయుష్షును పెంచే యోగ మన జీవన విధానం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ నెల 21న విశాఖపట్నంలో జరిగే 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ‘యోగాంధ్ర’ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమంలో భాగం కావాలని కోరారు. యోగాను జీవితంలో భాగం చేసుకుందాం... ఆరోగ్యంగా జీవిద్దాం అని ముఖ్యమంత్రి పిలుపు నిచ్చారు.

యోగా.. వ్యాయామం మాత్రమే కాదని, మన జీవన విధానమని చాటి చెప్పాలని విద్య శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ ఎంతో అవసరమని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం వేడుకల్లో, యోగాంధ్ర వేడుకలలో ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

======================

విశాఖలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కోరారు. బీచ్ రోడ్డులో ఈనెల 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లను నగరానికి చెందిన ప్రజాప్రతినిధులకి ఈ రోజ కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటు చేసిన బస్సులు, ఆటోలు వంటి పలు వాహనాల్లో మాత్రమే ప్రజలు ప్రయాణించి బీచ్ రోడ్డులో తమకు నిర్దేశించిన ప్రాంతానికి చేరుకోవలసి వుంటుందని, ప్రైవేటు వాహనాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలను తరలించేందుకు 2 వేల 085 బస్సులను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఈ బస్సులన్నీ 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకే ఆయా నియోజకవర్గాలకు చేరుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఈ బస్సుల్లో వచ్చే వారంతా తెల్లవారు ఝామున 5 గంటలకు తమకు కేటాయించిన ప్రదేశాలకు చేరుకొని మార్కింగ్‌లో నిలబడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. యోగ కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ ఉచితంగా టీ షర్టులు, యోగా మేట్‌లు అందజేయనున్నామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు.

=====================

పొగాకుకొనుగోళ్లకు 150 కోట్ల రూపాయలు కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ని కోరారు. ఈ రోజు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. బార్లీ, పొగాకు కొనుగోళ్లు, పామాయిల్ పై దిగుమతి సుంకం తగ్గింపు, ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్ పై జీఎస్టీ తగ్గింపు తదితర అంశాలపై ముఖ్యమంత్రి పీయూష్ గోయల్‌కి వినతి పత్రం అందించారు. పొగారు ధర తగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వం పొగాకు కొనుగోలుకు 300 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలలో 7 చోట్ల ప్రభుత్వం పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ముఖ్యమంత్రి వివరించారు. టొబాకో బోర్డు 150 కోట్ల రూపాయలు భరించే విధంగా చూడాలని, పొగాకు ఉత్పత్తి, మార్కెటింగ్‌ను టొబాకో బోర్డు నియంత్రించే విధంగా చూడాలని కేంద్రమంత్రిని కోరారు. ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం 10 శాతానికి తగ్గించడంపై పునరాలోచన చేయాలని, దిగుమతి సుంకం తగ్గింపుతో పామాయిల్ రైతులకు సరైన ధర రావడం లేదని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలోని వివిధ అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు.

విరామం

=====================

జాతీయ స్థాయిలో వైద్య విద్య కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన NEET UG- 2025లో ఉత్తీర్ణులైన వైద్య విద్యార్థులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 18వ ర్యాంక్ సాధించిన తెలంగాణకు చెందిన కాకర్ల జీవన్ సాయి కుమార్, 19వ ర్యాంక్ సాధించిన ఆంధ్రప్రదేశ్‌కి చెందిన దర్బా కార్తీక్ రామ్‌లను అభినందించారు. వీరి కృషి ఫలించిందని, వైద్య వృత్తిలో అడుగిడాలనే వారి కలను నెరవేర్చుకోవడానికి, ఆశావాహులందరికీ ప్రేరణగా నిలుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే... నీట్ ఫలితాలలో మెదటి 100 ర్యాంకులలో రాష్ట్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించడం పట్ల విద్య శాఖ మంత్రి నారా లోకేష్ సంతోషం వ్యక్తం చేస్తూ... వారిని అభినందించారు.

=====================

చదువు వ్యక్తి భవిష్యత్‌ను మారుస్తుందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈరోజు ఆయన హైదరాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు మంచి విద్య అవసరమని, తల్లికి వందనం పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెబుతూ....

(వాయిస్ 27 సెకన్లు)

=====================

వృద్ధులు సమాజంలో ఒక ముఖ్యమైన భాగమని పార్వతీపురం మన్యం రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈరోజు గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వృద్ధులు తమ జీవిత అనుభవాల ద్వారా యువతరానికి మార్గనిర్దేశం చేస్తారని, వారి పట్ల బాధ్యత కలిగి, గౌరవంతో నడచుకోవాలని సూచించారు.

వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు డివిజనల్, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా దృష్టి సారించడం జరుగుతోందని ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినం సందర్భంగా ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. వృద్ధులకు సంబంధించి వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు.

=====================

విశాఖ నగరంలో రేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నామని కలెక్టర్ ఎం.ఎన్.హరింధిర ప్రసాద్ తెలిపారు. అలాగే పోలీసు కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించాల్సిన పీ.జీ.ఆర్.ఎస్.ను రద్దు చేశామని అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

=====================

రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా కొట్టు పాలెం, యలమంచిలి లంక గ్రామాల్లో సుమారు కోటి రూపాయలు వ్యయంతో చేపట్టనున్న జల్ జీవన్ మిషన్ పథకం, డ్రైనేజి, రహదారుల పనులను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ... అన్నదాత సుఖీభవ కింద రైతులకు 20 వేల రూపాయలను కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. కాలువల్లో తవ్వకాలు, గుర్రపు డెక్క, తూడు తొలగింపు, వంతెనలు, కాంక్రీట్ గోడలు, గ్రావెల్ రహదారి పనులు చేపట్టామని చెప్పారు.

=====================

అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ... ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయాలని అరకు నియోజకవర్గం శాసన సభ్యులు రేగం మత్స్యలింగం అన్నారు.

=====================

=====================